సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం : 28 : మార్చి : 2023



బడి.. ప్రకృతి ఒడి

9లో▸

తాంసి మండలంలోని కప్పర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విరివిగా మొక్కలు పెంచడంతో హరితవనాన్ని తలపిస్తోంది.


అంబేద్కర్ చౌక్‌లో ఉద్రిక్తత

ఆదిలాబాద్‌రూరల్: శ్రీరామ నవమి శోభాయాత్ర సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో సోమవారం రాత్రి హిందూ సంఘాల ఆధ్వర్యంలో కట్టిన జెండాలు ఉద్రిక్తతకు దారితీసాయి. కాషాయ జెండాలు కట్టడాన్ని పలు దళిత సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో హిందూ, దళిత సంఘాల మధ్య వాగ్వివాదం జరిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలకు నచ్చజెప్పారు.

గరిష్టం/కనిష్టం
38.2/24.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. సాయంత్రం ఒకటిరెండు చోట్ల చినుకులు పడే అవకాశం ఉంది.



న్యూస్‌రీల్

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈఓ రవీందర్ కుమార్ తెలిపారు. జనరల్ కోర్సులో 8,549 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 8,075 మంది, ఒకేషనల్‌లో 977 మందికి గానూ 826 మంది పరీక్షలు రాసినట్లు ఆయన వివరించారు.

రిమ్స్‌ను సందర్శించిన డైరెక్టర్



రికార్డులు పరిశీలిస్తున్న జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిని డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ సోమవారం సందర్శించారు. అన్నివార్డుల్లో వైద్యులు, సిబ్బందిపై ఆరా తీశారు. బ్లడ్ బ్యాంక్‌లో హాజరు పట్టికను తనిఖీ చేశారు. 'సాక్షి'లో ప్రచురితమైన 'రెండేళ్లుగా స్టాఫ్ నర్సుకు డే డ్యూటీ' అనే కథనానికి స్పందించారు. సంబంధిత అధికారి ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోడలపై గుట్కా మరకలు చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు శుభ్రత చర్యలు పాటించాలని ఆదేశించారు.

విద్యార్థుల్లో పఠనాశక్తి పెంపొందించాలి



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లో పఠనాశక్తి పెంపొందించేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత అన్నారు. రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో కాంప్లెక్స్ హెచ్‌ఎం, ఎంఈవో, ఎఫ్‌ఎస్‌ఎల్ నోడల్ అధికారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ సంస్థ జిల్లా వ్యాప్తంగా 152 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసి 260 పుస్తకాలను అందించిందన్నారు. పాఠశాలకు 45 మంది విద్యార్థుల చొప్పున ఎంపిక చేసి ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి రాంబాబు, సెక్టోరల్ అధికారి కంటే నర్సయ్య, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ స్వర్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

'రాహుల్ గాంధీపై అనర్హత వేటు సరికాదు'



దీక్షలో కూర్చున్న కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: రాహుల్‌గాంధీపై అనర్హత వేటు సరికాదని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో సంకల్ప దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దు వెనుక కుట్ర దాగి ఉందన్నారు. మోదీ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా రాహుల్ గాంధీని ఆరేళ్లపాటు పార్లమెంటుకు రాకుండా చేసిందన్నారు. అవినీతిపై పార్లమెంట్‌లో గళాన్ని ఎత్తకుండా నిలువరించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓ చీకటిదినంగా అభివర్ణించారు. మోదీని గద్దె దించేంత వరకు పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. దీక్షకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. దీక్ష ప్రారంభానికి ముందు మహాత్మాగాంధీ, అంబేద్కర్, ఇందిరాగాంధీ చిత్రపటాలకు సీఎల్పీ నేత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు, ఆడే గజేందర్, ఆనంద్‌రావు, కలీం, అర్ఫాత్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్‌శాఖ కార్యాలయంలో మరమ్మతు కోసం వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లు

పవర్‌ఫుల్ డిమాండ్!

- పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- 15 మిలియన్ యూనిట్లు చేరిన వైనం
- ఏప్రిల్, మే నెలల్లో మరింత పెరిగే అవకాశం
- కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు
- పొదుపు పాటించాలంటున్న విద్యుత్‌శాఖ అధికారులు

నాలుగు నెలల్లో విద్యుత్ వినియోగం, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు

నెల	విద్యుత్ వినియోగం (మి.యూనిట్స్‌లలో)	కాలిన ట్రాన్స్‌ఫార్మర్లు
డిసెంబర్	13.48	59
జనవరి	14.42	57
ఫిబ్రవరి	14.21	55
మార్చి	15	55

కైలాస్‌నగర్: జిల్లాలో విద్యుత్ వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. భానుడు తన ప్రతాపం చూపిస్తుండడంతో మధ్నాహ్యం 12 గంటలు దాటితే చాలు ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. గత నెల ఫిబ్రవరి వరకు వాతావరణం చల్లగా ఉండడంతో విద్యుత్ వినియోగం అంతగా జరుగలేదు. కానీ ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతుండటంతో ఇందుకు అనుగుణంగా విద్యుత్ వినియోగం కూడా అధికమవుతోంది. ఇళ్లలో కూలర్లు, ఏసీల వాడకం అధికం అవుతోంది. వ్యవసాయానికి సంబంధించి రైతులు రబీలో మొక్కజొన్న, వేరుశనగ, జొన్న పంటలతో పాటు కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. ఆయా పంటలకు నీరందించేందుకు మోటార్లు నడుస్తున్నాయి. దీంతో విద్యుత్ వినియోగం అధికమై దాని ప్రభావం ట్రాన్స్‌ఫార్మర్లపై పడి కాలిపోతున్నాయి. రానున్న రోజుల్లో ఎండలు మరింత ముదిరే అవకాశం ఉంది. దీంతో విద్యుత్ డిమాండ్ కూడా మరింత పెరిగే అవకాశముందని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఇళ్లలోనూ పెరుగుతున్న వినియోగం

ఎండల తీవ్రత పెరుగుతుండడంతో ప్రజలు మధ్యాహ్నం 12 గంటల నుంచే ఇంటిపట్టున ఉండాల్సిన పరిస్థితి. దీంతో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వాడకం పెరగడంతో ఇళ్లలోనూ విద్యుత్ వినియోగం అధికమవుతోంది. జిల్లా వ్యాప్తంగా 1,57,521 గృహావసర విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటికి గానూ 9.84 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగమవుతోంది. ఏప్రిల్, మే నెలల్లో ఎండలు మరింత ముదిరే అవకాశం ఉన్నందువల్ల విద్యుత్ వినియోగం కూడా మరింత పెరిగే అవకాశం ఉంది.

కాలుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు

జిల్లాలో రబీ పంటలు సాగవుతున్నాయి. ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, జైనథ్, తలమడుగు, ఇచ్చోడ, ఉట్నూర్, తాంసి వంటి మండలాల్లో వేరుశనగ, మొక్కజొన్న, జొన్నపంటలతో పాటు కూరగాయలను ఎక్కువగా పండిస్తున్నారు. జిల్లాలో 29,866 వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇవీ 24గంటల పాటు నడుస్తుంటాయి. అయితే ఇటీవల ఎండల తీవ్రత అధికం కావడంతో పంటలకు నీటి వినియోగం సైతం పెరుగుతోంది. ఫలితంగా మోటార్లు ఒకేసారి ఆన్ చేస్తుండడంతో విద్యుత్ వినియోగం అధికమవుతోంది. కెపాసిటీకి మించి వినియోగం జరుగుతుండడంతో దాని ప్రభావం ట్రాన్స్‌ఫార్మర్లపై పడుతోంది. ఫలితంగా ఆ భారాన్ని తట్టుకోలేక ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. ప్రతి నెలా 50కి తగ్గకుండా ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవుతుండటం పరిస్థితికి అద్దం పడుతోంది. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుండంతో విద్యుత్ శాఖపై భారం పడుతుండగా వాటిని మార్చేందుకు రైతులు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే దాన్ని పంట పొలం నుంచి తీసుకువచ్చి, మరమ్మతులు చేయించి తిరిగి పంట పొలం వద్ద ఏర్పాటు చేయాల్సిన బాధ్యత విద్యుత్‌శాఖదేనని ఆ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఈ విషయంపై రైతులకు అవగాహన లేకపోవడం, కొన్నిచోట్ల విద్యుత్ అధికారులకు తెలియజేసినా వారు స్పందించకపోవడంతో రైతులే వాటిని జిల్లా కేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయానికి తీసుకువచ్చి మరమ్మతుల అనంతరం తీసుకెళ్తున్నారు. ఇందుకు ప్రైవేట్ వాహనాలు అవసరం కావడంతో రైతులు వాటి కోసం అదనపు భారం మోయాల్సి వస్తోంది.

విద్యుత్ పొదుపుగా వాడాలి



ఏప్రిల్, మే నెలల్లో కూలర్లు, ఏసీల వాడకంతో 20 శాతం డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్లపై ఓవర్‌లోడ్ పడి అవి కాలిపోయే అవకాశం ఉంది. వినియోగదారులపై భారం పడకుండా ఫిబ్రవరిలో ప్రత్యేక ప్రణాళికను రూపొందించుకుని అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు తెప్పించుకుంటున్నాం. ఇండస్ట్రియల్ , వ్యవసాయ కనెక్షన్లకు తప్పనిసరిగా కెపాసిటర్లను ఏర్పాటు చేసుకుంటే ట్రాన్స్‌ఫార్మర్లపై అంతగా భారం పడదు. రైతులు ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించుకోవాలి. గృహావసర వినియోగదారులు నాణ్యమైన విద్యుత్ పరికరాలనే ఉపయోగించాలి. అవసరం లేకుండా లైట్లు, ఫ్యాన్లు వాడకూడదు. ఎల్‌ఈడీ బల్బులను వినియోగించాలి. ప్రతిఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వాడాలి.

– కె.సంపత్‌కుమార్, ఎస్‌ఈ, జిల్లా విద్యుత్‌శాఖ

బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ దండె విఠల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. 'అబ్‌కీ బర్ కిసాన్ భారత్ సర్కార్' నినాదంతో కార్యకర్తలు ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి యువతకు మొండిచేయి చూపిందన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే జోగు రామన్న నేతృత్వంలో మావల మండలంలోని మావల హరితవనం పార్కులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆదిలాబాద్ రూరల్, మావల ఎంపీపీలు గండ్రత్ రమేశ్, దర్శనాల సంగీత ఏవన్, మావల జెడ్పీటీసీ నల్ల వనిత రాజేశ్వర్, పీఏసీఎస్ డైరెక్టర్ పరమేశ్వర్, ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొమ్మకంటి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో దేశంలోనే నంబర్‌వన్

- మాజీ ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్

నార్నూర్(ఆసిఫాబాద్): ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉందని, ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజా క్షేత్రంలో ఉండి ప్రజలకు వివరించాలని బీఆర్‌ఎస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ అన్నారు. సోమవారం గాదిగూడ మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికే ఈ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆరు నెలల్లో ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని, పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు తిప్పికొట్టాలన్నారు. జెడ్పీచైర్‌పర్సన్లు రాథోడ్ జనార్దన్, కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు యునుస్ అక్బానీ, ఎంపీపీ అడ చంద్రకళ రాజు, వైస్ ఎంపీపీ యోగేశ్, మండల అధ్యక్షుడు పూసం బాదిరావు, 25 గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారదాసు లక్ష్మణ్


ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



పూజల్లో పాల్గొన్న జెడ్పీచైర్మన్ జనార్దన్

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని, భక్తిమార్గంతోనే ప్రశాంతత దొరుకుతుందని జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. సోమవారం మండలంలోని హర్కపూర్‌తండాలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో మండల కేంద్రానికి చెందిన రాందాస్ మహారాజ్ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీచైర్మన్, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, పెంబి జెడ్పీటీసీ జానుబాయి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చౌహాన్ ఉమాజీ నాయక్, దూదిరాం, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు




రశీదు తీసుకుంటున్న ఉద్యోగులు

కైలాస్‌నగర్: రాములవారి కల్యాణ తలంబ్రాలను ఇంటి వద్దకే వచ్చి అందిస్తామని ఆర్టీసీ కార్గో ఉద్యోగులు సాయన్న, ప్రసాద్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రచారం నిర్వహించారు. రూ. 116తో తలంబ్రాలు బుక్ చేసుకుంటే ఇంటి వద్దకే డెలివరీ చేస్తామన్నారు. దీంతో పలువురు ఉద్యోగులు, సిబ్బంది తలంబ్రాలను బుక్ చేసుకున్నారు.

మళ్లీ కరోనా గుబులు

- జిల్లాలో నమోదవుతున్న కేసులు
- కోవిడ్ నిబంధనలు పాటించని జనాలు
- టెస్టులు, వ్యాక్సిన్‌కు వెనుకంజ



ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో మళ్లీ కరోనా గుబులు రేపుతోంది. గత వారం, పది రోజులుగా రోజుకు ఒకట్రెండు కేసులు నమోదవుతున్నాయి. రెండు మూడేళ్లుగా ఫిబ్రవరి, మార్చి మాసాల్లోనే కేసులు పెరుగుతున్నాయి. ఫస్ట్ వేవ్, సెకండ్ వేవ్‌లో తీవ్ర నష్టాలు కలిగించిన విషయం తెలిసిందే. వ్యాక్సిన్ వేసుకున్న తర్వాత దాని ప్రభావం అంతగా లేకపోయినప్పటికీ కేసులు మాత్రం నమోదయ్యాయి. చాలామంది ఫస్ట్ డోస్, సెకండ్ డోస్ తీసుకున్న తర్వాత బూస్టర్ డోస్ తీసుకునేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో వదంతుల వల్ల వ్యాక్సిన్ వేయించుకునేందుకు జనాలు ఆసక్తి చూపడం లేదు. లక్షణాలు ఉన్నప్పటికీ కరోనా పరీక్షలు చేయించుకునేందుకు జనాలు ముందుకు రావడం లేదు. కోవిడ్ నిబంధనలు పూర్తిగా మర్చిపోయారు. అప్రమత్తంగా ఉండకపోతే మరోమారు ముప్పు తప్పదని వైద్యులు సూచిస్తున్నారు.

వ్యాక్సిన్‌కు వెనుకంజ..

కోవిడ్ ఉధృతి సమయంలో జనాలు వ్యాక్సిన్ కోసం కేంద్రాల వద్ద బారులు తీరిన విషయం తెలిసిందే. వ్యాక్సిన్ తీసుకున్న వారికి గుండె సంబంధిత వ్యాధులు వస్తున్నాయని సోషల్ మీడియాలో వస్తున్న వదంతులతో జనాలు భయాందోళన చెందుతున్నారు. అవగాహన కల్పించాల్సిన వైద్యశాఖ ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో ఐదారు నెలల నుంచి వ్యాక్సిన్ వేసుకునేందుకు ప్రజలు ముందుకు రావడం లేదు. జిల్లాలో ఫస్ట్ డోస్ వ్యాక్సిన్ 5,52,815 మంది తీసుకోగా 101 శాతం నమోదైంది. రెండో డోస్ 5,55,884 మంది తీసుకోగా 101 శాతంగా నమోదైంది. ప్రికాషన్ డోస్ 2,65,780 మంది తీసుకోగా, 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు వారు 37,631 మంది వ్యాక్సిన్ వేయించుకున్నారు. 12 నుంచి 14 సంవత్సరాల వయస్సు వారు మొదటి డోస్ 24,877 మంది తీసుకోగా, రెండో డోస్ 23,534 మంది తీసుకున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అయితే బూస్టర్ డోస్ తీసుకునేందుకు మాత్రం అంతగా ఆసక్తి కనబర్చడం లేదు. జిల్లాలోని 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 20 చొప్పున మాత్రమే వ్యాక్సిన్‌లు పంపిణీ చేస్తున్నారు. వాటిని కూడా వేయించుకోకపోవడంతో వాటి గడువు ముగుస్తోంది. మార్చి వరకు 6 వేల కోవాగ్జిన్ వ్యాక్సిన్ రాగా ప్రస్తుతం ఏ ఆరోగ్య కేంద్రంలో కూడా నిల్వలు లేకుండా పోయాయి.

టెస్టులకు వెనుకంజ..

మొదటి, రెండో వేవ్‌లో లక్షణాలు ఉన్నవారు కోవిడ్ టెస్టులు చేసుకునేందుకు పీహెచ్‌సీలతో పాటు రిమ్స్ ఆస్పత్రిలో బారులు తీరారు. ప్రస్తుతం రిమ్స్ ఆస్పత్రి తప్పితే అక్కడక్కడా ఒకరిద్దరు కరోనా పరీక్షలు చేయించుకుంటున్నారు. వారం, పది రోజులుగా జిల్లాలో కోవిడ్ కేసులు నమోదవుతున్నాయి. కరోనా లక్షణాలు ఉన్నప్పటికీ సీజనల్ వ్యాధులు వస్తున్నాయని అంతగా పట్టించుకోవడం లేదు. దగ్గు, జలుబు, జ్వరం, ఒళ్లునొప్పులు, తదితర సమస్యలతో బాధపడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో 5 యాక్టీవ్ కేసులు ఉన్నాయి. ఇద్దరు రిమ్స్‌లో చికిత్స పొందుతుండగా, ముగ్గురు హోమ్ ఐసోలేషన్‌లో ఉన్నారు. ఇప్పటివరకు జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారం 92 మంది మృతి చెందగా, అనధికారికంగా 300 లకు పైగా ఉంటారని తెలుస్తోంది.

అప్రమత్తంగా ఉండాలి



కోవిడ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. లక్షణాలు ఉంటే సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలి. విందులు, వినోదాలకు దూరంగా ఉండాలి. భౌతిక దూరం పాటించడంతో పాటు మాస్కులను తప్పనిసరిగా ధరించాలి. రెండు రోజుల్లో వ్యాక్సిన్ నిల్వలు అయిపోయాయి. రెండురోజుల్లో అందుబాటులోకి వస్తాయి. వ్యాక్సిన్ వేసుకుంటే గుండెపోటు వస్తుందనేది అపోహ మాత్రమే.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

భూ సమస్యలపై ధరణిలో దరఖాస్తు చేసుకోవాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ప్రజావాణికి వచ్చిన అర్జీలను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని సంబంధిత అధికారులకు అందజేస్తూ పరిష్కరించేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూములకు సంబంధించిన సమస్యలకు ధరణి పోర్టల్‌లో మీసేవ కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న అర్జీలపై శాఖల వారీగా సమీక్షించారు. గత వారం నాటికి 834 అర్జీలు పెండింగ్‌లో ఉండగా 299 పరిష్కారమయ్యాయి. వచ్చే మూడు వారాల్లోగా అన్ని అర్జీలను పరిశీలించి సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, ట్రెయినీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీవో రమేశ్ రాథోడ్, జెడ్పీ సీఈవో గణపతి, తదితరులు పాల్గొన్నారు.

పోషక విలువలపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



పోషకాహార పదార్థాలు పరిశీలిస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: ప్రజలు పోషక విలువలతో కూడిన ఆహారపదార్థాలు తీసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోషణ్ అభియాన్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. సీడీపీఓలు, సూపర్ వైజర్లు కేంద్రాలను రెగ్యులర్‌గా పర్యవేక్షించాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఏ ఒక్క సామ్–మామ్ కేసులు ఉండకూడదని, అందుకు పోషణ్ అభియాన్‌ను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. చిరు ధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయల ప్రాధాన్యతను ప్రజలకు వివరించడంతో పాటు వాటిని స్థానికంగా పండించేలా వ్యవసాయ, ఉద్యాన శాఖల ద్వారా రైతులను ప్రోత్సహించాలన్నారు. అనంతరం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చిరుధాన్యాలు, ఆకుకూరలతో వండిన వివిధ వంటకాల ప్రదర్శనను కలెక్టర్ సందర్శించి ఆహార పదార్థాలను రుచి చూశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, ట్రెయినీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, జిల్లా సంక్షేమాధికారి మిల్కా, ఆర్డీవో రమేశ్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి



వంతెన పనులు పరిశీలిస్తున్న సుహాసినిరెడ్డి

జైనథ్: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే జోగు రామన్న విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తరోడ గ్రామంలో ఇటీవల కుంగిన వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2018లో కురిసిన భారీ వర్షాలకు తరోడ వంతెన కుంగడంతో రాకపోకలు నిలిచిపోయాయన్నారు. అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి రాకపోకలు పునరుద్ధరించారన్నారు. అప్పుడే నూతన వంతెన కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తే ఈపాటికే పనులు పూర్తయ్యేవన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న అలసత్వంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని విమర్శించారు. బ్రిడ్జి వద్ద ప్రయాణికులతో మాట్లాడి వారి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగుల సంక్షేమానికి కృషి



ఇన్‌చార్జి వీసీని సన్మానిస్తున్న బోధనేతర సిబ్బంది

భైంసా: ఆర్జీయూకేటీ బోధనేతర ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని వర్సిటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ అన్నారు. ఈ మేరకు సోమవారం వర్సిటీ బోధనేతర సిబ్బంది ఆయన్ను కలిశారు. 30 శాతం పీఆర్సీని అమలు చేయడంతోపాటు రెండోవిడత బకాయిలు చెల్లించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్యాంబాబు, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ అరుణజ్యోతి, ప్రధాన కార్యదర్శి షేక్ దస్తగిరి, సభ్యులు రవివర్మ, హరికృష్ణ, మోహన్‌బాబు, బద్రి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం



దగ్ధమవుతున్న ఇల్లు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని నవయువ కాలనీలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధమైంది. కాలనీవాసుల తెలిపిన వివరాలు.. నర్సమ్మ (80) అనే వృద్ధురాలు గత కొంతకాలం నుంచి కాలనీలో ఓ ఇంట్లో నివాసం ఉంటుంది. ఉదయం బహిర్భూమికి వెళ్లింది. షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులకు నిప్పంటుకుని కాలిపోయింది. చుట్టుపక్కల వారు గమనించి అగ్నిప్రమాద కేంద్రానికి సమాచారం అందించారు. సమయానికి వాహనం రాకపోవడంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైందని కాలనీవాసులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ ప్రీతంరెడ్డి వృద్ధురాలిని పరామర్శించి రూ.10 వేల నగదు అందజేశారు. సామాజిక కార్యకర్త నిమ్మల సంతోష్‌రెడ్డి వృద్ధురాలికి నూతన వస్త్రాలు అందజేసి ఉదారతను చాటుకున్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని కురన్నపేట్ చెరువులో ఈత కొడుతూ గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైనట్లు పట్టణ సీఐ మల్లేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈనెల 25న స్థానిక ధ్యాగావాడకు చెందిన పూసం పవన్ (28) మద్యం తాగి కురన్నపేట్ చెరువులో ఈత కొడుతూ ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. ఈ మేరకు పోలీసులు, పట్టణ ఎస్సై జ్యోతిమణి ఆధ్వర్యంలో గత రెండు రోజుల నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి మృతదేహం లభ్యమైనట్లు సీఐ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

పాలీహౌస్‌కు ప్రోత్సాహం ఏది?

- ఐదేళ్లుగా దరఖాస్తుల స్వీకరణ లేదు
- రైతులకు సబ్సిడీ ఇవ్వకుండా చేతులెత్తేసిన ప్రభుత్వం
- లాభాలు ఉన్నా ఫలితం సున్నా



ఇచ్చోడ మండలంలోని అడేగామ(కె)లో పాలీహౌస్

ఇచ్చోడ: జిల్లాలో ఉద్యానవన పంటలకు అనుకూలమైన నేలలు ఉన్నప్పటికీ పాలీహౌస్ రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం కరువైంది. పాలీహౌస్‌పై సబ్సిడీ ఇవ్వకుండా చేతులెత్తేసింది. ఉద్యానవన పంటల సాగు వైపు రైతులు మొగ్గుచూపడం లేదు. రాష్ట్రం ఏర్పాటు తర్వాత జిల్లాలో ఉద్యాన హబ్‌గా మారుస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో జిల్లాలో ఎంతో మంది రైతులు ఆశ పడ్డారు. కాని ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో 2018 నుంచి పాలీహౌస్‌లపై ప్రభుత్వం సబ్సిడీని నిలిపివేసింది. ఐదేళ్ల నుంచి పాలీహౌస్‌ల కోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం లేదు.

గతంలో భారీ సబ్సిడీ

ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం గత ఐదేళ్ల క్రితం భారీగా సబ్సిడీ ఇచ్చింది. ఎకరా పాలీహౌస్‌కు ఎస్సీ, ఎస్టీ రైతులకు 95 శాతం, ఇతర రైతులకు 75 శాతం సబ్సిడీపై పాలీహౌస్‌లకు కోసం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. దీంతో జిల్లాలో రైతులు పాలీహౌస్‌ల ద్వారా కూరగాయలు, ఆకుకూరలు, దోస తదితర పంటలు పండించి అధిక లాభాలు పొందారు.



పాలీహౌస్‌లో సాగువుతున్న దోస

లాభాలు ఉన్న ఫలితం సున్నా

ప్రతిఏటా అతివృష్టి, అనావృష్టితో పంటల పండక ఆర్థికంగా నష్టపోవడంతో రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందే సాంకేతిక వ్యవసాయం చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. దీనిలో భాగంగా అనేక మంది పాలీహౌస్‌లు ఏర్పాటు చేయాలని అనుకున్నా జిల్లాలో గత ఐదేళ్ల నుంచి పాలీహౌస్ యూనిట్లు మంజూరు కాలేదు. ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న రైతుల ఆశలు ఆవిరి అవుతున్నాయి.

జిల్లాలో 30 ఎకరాల్లో సాగు

జిల్లాలో దాదాపుగా రెండున్నర లక్షల ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు ఉన్నాయి. ఈ లెక్కన జిల్లాలో కనీసం 20 వేల ఎకరాల వరకు ఉద్యానవన పంటలు సాగు కావాలి. కాని ప్రసుతం జిల్లాలో కేవలం 30 ఎకరాల్లో మాత్రమే పాలీహౌస్ కింద వివిధ పంటలు సాగవుతున్నాయి.

ఏడాదిలో రూ 3 లక్షల లాభం



పాలీహౌస్‌తో కూరగాయలు, వేసవిలో దోస సాగు చేశారు. ఏడాదిలో పంటల సాగుకు ఖర్చులు పోను రూ.3 లక్షల లాభం వచ్చింది. వర్షాకాలంలో కూరగాయల సాగుకు పాలీహౌస్ చాలా అనుకూలంగా ఉంటుంది. – కుమ్ర కేశవ్‌రావు, పాలీహౌస్ రైతు, మార్కగూడ, ఇంద్రవెల్లి మండలం

రూ.లక్ష లాభం వచ్చింది



అర ఎకరంలో బ్రోకోలిని పాలీహౌస్ కింద సాగు చేశాను. మంచి దిగుబడి వచ్చింది. పంటపై పెట్టిన ఖర్చులు పోను దాదాపు రూ.లక్ష లాభం వచ్చింది. ప్రసుతం మరో ఎకరంలో దోస సాగు చేస్తున్నాను. – గణేష్, రాథోడ్, పాలీ హౌస్ రైతు దాబా(కె) ఇచ్చోడ మండలం.

దరఖాస్తుల స్వీకరణ నిలిపివేత



ప్రభుత్వం 2018 నుంచి పాలీహౌస్ కోసం దరఖాస్తులు స్వీకరణ నిలిపివేసింది. పాలీహౌస్ సాగుకు జిల్లా నేలలు అనుకూలం. పాలీ హౌస్‌ల ద్వారా సాగు చేయడానికి రైతులు ఆసక్తితో ఉన్నారు. ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వకపోవడంతో రైతులు సాగుకు ముందుకు రావడంలేదు. – మహేశ్, ఉద్యానవన శాఖ అధికారి

ఊరెళ్తే.. దోచుకెళ్లారు

ఆదిలాబాద్‌టౌన్: కూలీనాలీ చేసుకుని కూడబెట్టుకున్న డబ్బులను దొంగలు ఎత్తుకెళ్లిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పరిధిలోని మహాలక్ష్మివాడకు చెందిన ఎడిపెల్లి స్వామి నివాసముంటున్నాడు. రజకవృత్తి చేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 25న సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో స్వామి తన కుటుంబీకులతో భీంపూర్ మండలం పిప్పల్‌కోఠి గ్రామంలోని తన బంధువుల ఇంటికి వెళ్లాడు. తాళం వేసి ఉండటాన్ని గమనించిన దుండగులు ఇంట్లోకి చొరబడి రూ.10వేల నగదు, 5 గ్రాముల బంగారం, 2 గ్రాముల వెండిని ఎత్తుకెళ్లారు. మరుసటి రోజు 26న తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన చుట్టుపక్కల వారు ఫోన్ ద్వారా బాధితుడికి సమాచారమందించారు. వారు హుటాహుటిన ఇంటికి చేరుకున్నారు. కష్టపడి కూడబెట్టుకున్న సొమ్ము దొంగల పాలు కావడంతో కన్నీరుమున్నీరయ్యారు. దీనిపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఉట్నూర్: గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు, డీడీ దిలీప్‌కుమార్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల ప్రజలు అర్జీలు అందజేశారు. రైతుబంధు, డబుల్ బెడ్రూం, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ దరఖాస్తులు సమర్పించారు. శాఖల అధికారులు అర్జీలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొమురం బాలు, ఓఎస్డీ కిష్టయ్య, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ స్థాయి ఐఎన్‌టీఎస్‌ఓ ఒలింపియాడ్ లెవల్–2 పరీక్షల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పట్టణంలోని చైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ బహుమతి, 4, 5వ బహుమతులతో పాటు 31 మంది గోల్డ్‌మెడల్, 20 మంది మెరిట్ సర్టిఫికెట్‌ను పొందినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో నజీమ్, జెస్సిక, అజయ్, శ్రీవిద్య, శ్రీధర్, లక్ష్మణ్‌రావు, రాజు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

200 క్వింటాళ్ల సోయా, లారీతో ఉడాయింపు

- బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు

జైనథ్: మండలంలోని మేడిగూడలో ఈనెల 24న కొనుగోలు చేసిన 200 క్వింటాళ్ల సోయాలు, లారీతో దుండగులు ఉడాయించారు. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం.. ఆదిలాబాద్‌లోని మహాలక్ష్మివాడకు చెందిన చంద్రకాంత్ ఈనెల 24న మేడిగూడలో 200 క్వింటాళ్ల సోయలు కొనుగోలు చేశాడు. అనంతరం కేఆర్కే కాలనీకు చెందిన చౌహాన్ రవి అనే డ్రైవర్‌ను నియమించుకుని లారీలో సోయాలోడ్ నింపుకొన్నాడు. ఈనెల 24 సాయంత్రం డ్రైవర్ రవి, క్లీనర్ ఆత్మరాంతో కలిసి మేడిగూడ నుంచి మహారాష్ట్రకు బయల్దేరాడు. అయితే మహారాష్ట్రకు వెళ్లిన తర్వాత నుంచి డ్రైవర్ ఫోన్ స్విచాఫ్ రావడంతోపాటు లారీ ఆచూకీ తెలియలేదు. రెండు రోజుల పాటు గాలించినప్పటికి ఫలితం లేకపోయింది. సోమవారం బాధితుడు చంద్రకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాథోడ్ ఆత్మారాం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



అల్లె రాజన్న మృతదేహం

కడెం: మండలంలోని దర్మాజీపేట్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్లె రాజన్న (48) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామానికి చెందిన అల్లె రాజన్న ఆదివారం రాత్రి ఖానాపూర్ వైపు నుంచి స్వగ్రామానికి ఆటోలో వెళ్తున్నాడు. దర్మాజీపేట్ గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద ఆటో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజన్నకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొసన రాజు తెలిపారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.



పిల్లపాపలతో ప్రజావాణికి వచ్చిన అడెల్లి తండావాసులు

గూడు కోసం గోస



సారంగపూర్ మండలం అడెల్లితండాలో గత 20 ఏళ్లుగా కనీస వసతులు, గూడు లేక తండావాసులు గోస పడుతున్నారు. తమ బాధ చెప్పకునేందుకు నిర్మల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వచ్చారు. పిల్లపాపలతో వచ్చి తమకు కనీస వసతులు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన



నిరసన తెలుపుతున్న వైద్యులు

ఆదిలాబాద్‌టౌన్: రాజస్థాన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైట్ టు హెల్త్ పథకాన్ని నిరసిస్తూ జిల్లాకేంద్రంలో వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం రిమ్స్ డైరెక్టర్ చాంబర్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఐఎంఏ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టగా రిమ్స్‌లో పనిచేస్తున్న వైద్యులతో పాటు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు హాజరయ్యారు. అనంతరం ఐఎంఏ బాధ్యులు మాట్లాడుతూ రాజస్థాన్‌లో ప్రవేశపెట్టిన రైట్ టు హెల్త్ ద్వారా వైద్యులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. ఈ పథకంలో రోగి ఏ సమయంలో వచ్చినా వైద్య సేవలందించాలని, వ్యాధికి సంబంధం లేని వైద్యుడు సైతం ట్రీట్మెంట్ చేసేలా జీవో తీసుకొచ్చారని తెలిపారు. ప్రైవేట్ వైద్యులు రోగుల నుంచి ఎలాంటి డబ్బులు తీసుకోకుండా ఉచిత వైద్యం అందించేలా జీవోలో పొందుపర్చడం సరికాదన్నారు. వైద్యులు సుమలత, శ్యాంప్రసాద్, ఇద్రిస్ అక్బాని, కల్యాణ్‌రెడ్డి, శ్యామల, అరుణ, సత్యనారాయణ, తిరుమల్‌రెడ్డి, సందీప్ పవార్, సూరజ్, ప్రకాశ్, స్వామి పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌నకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థినుల ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ

భైంసా: ప్రొక్టర్, క్యాంపుల్ ఇండియా ఆధ్వర్యంలో అందిస్తున్న శిక్షా భేటియా స్కాలర్‌షిప్‌నకు బాసర ఆర్జీయూకేటీ విద్యార్థినులు పలువురు ఎంపికయ్యారు. ఈ మేరకు వారిని ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ సోమవారం అభినందించారు. రాష్ట్రంలోని ప్రముఖ సాంకేతిక విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థినులను స్కాలర్‌షిప్‌నకు ఎంపికచేసి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. వర్సిటీకి చెందిన 32 మంది విద్యార్థినులు స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. స్కాలర్‌షిప్ సెక్షన్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డాక్టర్ విఠల్, సిబ్బంది చిన్నారెడ్డి, శ్వేత, హిమబిందు, సమీనా బేగం, నవకాంత్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య



ఉమాకాంత్(ఫైల్)

ఇంద్రవెల్లి: మద్యానికి బానిసై ఒకరు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు, ఎస్సై డి.సునీల్ తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని మిలింద్‌నగర్ గ్రామానికి చెందిన ముండే ఉమాకాంత్(39) డ్రైవర్‌గా, కూలీ పని చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రస్తుతం ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి తాగిన మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య భాగ్యశ్రీ, కుమారుడు, కూతురు ఉన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలు

నిర్మల్‌టౌన్: హత్యాయత్నం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలుశిక్షతోపాటు, ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమానా విధిస్తూ నిర్మల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి అజేష్‌కుమార్ సోమవారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపిన వివరాలు.. ఖానాపూర్ మండలం తర్లపాడ్‌కు చెందిన కోవ మారుతి(35), గ్రామస్తులందరూ కలిసి 2019, మే 20న వనభోజనాల కోసం ఊరు బయటకు వెళ్లారు. భోజనాలు చేసి ఇంటికి వస్తున్న సమయంలో కొందరు మద్యం తాగి గొడవ పడుతున్నారు. కులపెద్దగా ఉన్న కోవ మారుతి వారిని సద్దుజెప్పేందుకు ప్రయత్నించారు. అక్కడే ఉన్న అదే గ్రామానికి చెందిన పూసం మాధవరావు(35), పూసం అన్ను (45) ఇద్దరు అన్నదమ్ములు పాత కక్షలను మనసులో పెట్టుకొని మారుతిని గొడ్డలితో దాడికి యత్నించారు. ఈ దాడిలో ఆయన ముక్కుకు తీవ్రగాయం కావడంతో బాధితుడిని గ్రామస్తులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుడి భార్య కోవ లక్ష్మి ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై జి.ప్రసాద్ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు. చార్జ్‌షీట్ దాఖలు చేసి కోర్టులో నిందితులను హాజరుపర్చగా పీపీ వై.రమణారావు 9 మంది సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో జడ్జి తీర్పు వెలువరించారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన కార్మికులు

కైలాస్‌నగర్: తమ వేతన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్‌తో మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు విధులకు హాజరయ్యేందుకు వచ్చి.. విధులకు వెళ్లకుండా కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఉదయం 10:30 గంటల వరకు ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకుని వారి వద్దకు వచ్చిన మున్సిపల్ కమిషనర్ ఏ.శైలజకు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ విన్నవించారు. ఆమె సానుకూలంగా స్పందించడంతో వారు ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న తమ సమస్యలను సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశా రు. 8 నెలలుగా పీఎఫ్ బకాయిలను కోత విధిస్తున్నప్పటికి వాటిని తమ ఖాతాల్లో జమ చేయడం లేదన్నారు. నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వేతన, పీఎఫ్ బకాయిలను అధికారులు వెంటనే చెల్లించాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కాగా, వీరి ఆందోళనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సుహాసినిరెడ్డి మద్దతు తెలిపారు.

సమస్యలను చెప్పుకునేందుకే వెళ్లాం

పీఆర్సీ, పీఎఫ్, వారాంతపు సెలవులు వంటి అంశాలపై మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు వెళ్తే వివిధ పార్టీలు, సంఘాల నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పేర్కొన్నారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన మీడియా సమావేశంలో కార్మికులు నగేశ్, శంకర్, రాకేశ్, లక్ష్మి, ఉషన్న, సురేశ్ మాట్లాడారు. కార్మికులందరం కలిసి మున్సిపల్ కమిషనర్‌తో పలు అంశాలపై చర్చించేందుకు వెళ్లామన్నారు. తమకు రావాల్సిన పీఆర్సీ, పీఎఫ్, వారాంతపు సెలవులు, ఏరియర్స్ తదితర అంశాలపై మున్సిపల్ చైర్మన్‌తో పాటు కమిషనర్ స్పష్టమైన హామీలు ఇవ్వడంతో తిరిగి విధుల్లోకి వెళ్లినట్లు పేర్కొన్నారు. తాము ఎలాంటి సమ్మెలు, ధర్నాలు చేయలేదన్నారు. తెలంగాణ వచ్చాక ప్రభుత్వం రెండుసార్లు మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచిందని, ప్రస్తుతం రూ. 15,600 వేతనం అందుతుందని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురికి జైలు

కడెం: మద్యం తాగి వాహనాలు నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడిన ఆరుగురికి ఖానాపూర్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ జితిన్‌కుమార్ ఒకరోజు జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని ఎస్సై రాజు తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన ఆర్క వెంకటేశ్, నేర్పపల్లి గణేశ్, నైతం సురేశ్, నీరటి శమిందర్, భుక్యా రాజేందర్, శ్రీరాముల రవిని సోమవారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా, ఒకరోజు జైలు శిక్ష విధించారని పేర్కొన్నారు. ఈ మేరకు వారిని నిర్మల్ జైలుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

నస్పూర్: ఏరియాలోని వివిధ డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్, ఆటోగ్యారేజీ, ఏరియా స్టోర్, టింబర్ యార్డ్, ఆర్కే 8 డిస్పెన్సరీలో బాయిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులకు రెస్ట్‌హాల్స్ మినరల్ వాటర్ సౌకర్యం, రేడియం జాకెట్స్ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. శ్యాం, స్వామి, నాయకులు పెట్టం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.